సాక్షి అన్నమయ్య జిల్లా

ఆదివారం । 4 । ఫిబ్రవరి । 2024



అనుగ్రహించే తల్లి లూర్దుమాత

లూర్దుమాత మానవాళిని పరిపూర్ణంగా అనుగ్రహించే తల్లి అని బద్వేలు విచారణ గురువులు రెవ ఫాదర్ గొడుగునూరు విజయరావు అన్నారు. -8లో



మంగంపేటపై సీఎంకు అభిమానం

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మంగంపేట అంటే ప్రత్యేక అభిమానమని ఏపీ ఎండీసీ ఎండీ వి.జి. వెంకటరెడ్డి పేర్కొన్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.250	రూ.320
రెండోరకం	రూ.150	రూ.248



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 107 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	471	471
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 74.600 కిలోలు

న్యూస్‌రీల్

కలికిరి మండలంలో ఏనుగుల సంచారం



అటవీప్రాంతంలో సంచరిస్తున్న ఏనుగులు

కలికిరి: రెండు రోజుల కిందట అన్నమయ్య జిల్లా సోమల మండలంలో ఏనుగుల జంట సంచరించింది. ఈ ఏనుగులు శనివారం రాత్రి కలికిరి, వాల్మీకిపురం మండలాల సరిహద్దు ప్రాంతమైన గుట్టపాళెం, మేకలవారిపల్లి అటవీప్రాంతం ఎర్రగుంట్లబావి ప్రాంతానికి చేరుకున్నట్లు అటవీశాఖ సెక్షన్ అధికారి(ఎఫ్ఎస్ఓ) సుధాకర్ తెలిపారు. చుట్టు పక్కల గ్రామా గ్రామాల ప్రజలు, ముఖ్యంగా రైతులు, పశువుల కాపరులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అలాగే ఎనుగుల సంచారం సమాచారం రైతులు, పశువుల కాపరులకు తెలియచేసి అప్రమత్తం చేయాలని వలంటీర్లను ఆదేశిస్తూ పంచాయతీ కార్యదర్శులు సమాచారమిచ్చారు.

పింఛన్ల పంపిణీ 97.16 శాతం

కడప రూరల్: వైఎస్సార్ జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్ పింఛన్ కానుక కింద పింఛన్ల పంపిణీ ప్రక్రియ శరవేగంగా సాగుతోంది మూడో రోజైన శనివారం మొత్తం 2,68,881 పింఛన్లకు 2,61,255 మందికి పింఛన్లను అందజేశారు. దీంతో 97.16 శాతం నమోదైంది. కాగా పింఛన్ల పంపిణీలో రాష్ట్రంలో జిల్లా 5వ స్థానంలో నిలిచింది. వలంటీర్లు ఇంటి వద్దకే వచ్చి పింఛన్లను పంపిణీ చేయడం పట్ల పింఛన్లను పొందుతున్న వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సెమిస్టర్ ఫలితాలు విడుదల

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోని ప్రొద్దుటూరు వైఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రథమ సెమిస్టర్ ఫలితాలు విడుదలయ్యాయి. శనివారం వైవీయూలో వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య, ప్రొద్దుటూరు ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సి. నాగరాజు, డీన్ ఆచార్య కె.రమణయ్య, వైవీయూ ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డిలతో కలిసి ఫలితాలను విడుదల చేశారు. సివిల్, సీఎస్ఈ, ఈఈఈ, ఈసీఈ, ఎంఈ, ఎంఎంటీ బ్రాంచ్‌లలో 240 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 196 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. 81.66 శాతం ఫలితాలు వచ్చాయన్నారు. సివిల్‌లో 85.71 శాతం, కంప్యూటర్ సైన్స్‌లో 90.90, ఈఈఈలో 74.41, ఈసీఈలో 65.21, ఎంఈలో 78.78, ఎంఎంటీలో 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు అధికారులు పేర్కొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

కడప అగ్రికల్చర్: రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమమే ధ్యేయంగా ఎన్నో కార్యక్రమాలను చేపడుతోందని వైఎస్ఆర్ జిల్లా వ్యవసాయాధికారి అయితా నాగేశ్వరరావు పేర్కొన్నారు.శనివారం ఊటకూరులోని ఏఆర్ఎస్ సెంటర్‌లో ఆత్మ ఆధ్వర్యంలో వ్యవసాయ డివిజన్ పరిధిలోని ఆర్‌బీకే సిబ్బందికి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుభరోసా కేంద్రాలు(ఆర్‌బీకే) నాలెడ్జ్ సెంటర్లుగా తయారు కావాలని, రైతులు శాస్త్రవేత్తలుగా ఎదగాలని అన్నారు. ఆర్‌బీకే సిబ్బంది పంటలపైన శాస్త్రవేత్తలు ఇచ్చే సలహాలను రైతులకు తెలియచేయాలన్నారు. ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ విజయలక్ష్మి, కేవీకే ఆర్డినేటర్ వీరయ్య, ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త శ్రీనివాసచారిమాట్లాడారు.శాస్త్రవేత్తలు సునీల్, మానస పలు సూచనలు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో డీఆర్‌సీ డీడీ రమణారెడ్డి, డీఆర్‌సీ ఏడీ పద్మజ, శైలజ, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

విజయీభవ



- ఇంటర్‌లో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం
- జయీభవ, సంకల్ప ద్వారా విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ
- వార్షిక పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

రాయచోటి: ఇంటర్ పరీక్షల్లో వందశాతం ఫలితాలు సాధనే లక్ష్యంగా జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఉత్తమ ఫలితాల సాధనకు ప్రత్యేక ప్రణాళికలను రూపొందించారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంచి పరీక్షలకు పూర్తి స్థాయిలో సన్నద్ధం చేస్తున్నారు. జయీభవ సంకల్ప పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు. గతేదాది డిసెంబరు 14 నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమం ఈ నెల 24వ తేదీ వరకు జరుగుతుందని ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. పరీక్షలంటే విద్యార్థులలో భయాన్ని పోగొట్టేందుకు కృషి చేస్తున్నారు. సబ్జెక్టుల వారీగా మెరుగైన శిక్షణ ఇస్తున్నారు.

- ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో వంద శాతం ఫలితాలు సాధించేందుకు జిల్లా ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు, అధ్యాపకులు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నారు. ప్రథమ,ద్వితీయ సంవత్సరాలకు సంబంధించి 29833 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. జనరల్ విద్యార్థులకు 54, ఒకేషనల్‌కు 19 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో మొదటి సంవత్సరం 14731 మంది, రెండోసంవత్సరం 15102 మంది విద్యార్థులు పరీక్షలను రాయబోతున్నారు. ఈనెల 5వ తేది నుంచి 20వ తేదీ వరకు ప్రాక్టికల్ పరీక్షలను నిర్వహించనున్నారు. ఇందుకోసం జిల్లాలో 61 కేంద్రాలను సిద్ధం చేశారు. ఈనెల 3వ తేది నుంచి జరగాల్సిన ఒకేషనల్ పరీక్షలను ఈనెల 23వ తేదీకి వాయిదా వేశారు..

మార్చి 1 నుంచి పబ్లిక్ పరీక్షలు..

ఇంటర్ పబ్లిక్ పరీక్షలను మార్చి నెల 1 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించేందుకు ఏర్పాట్లను సిద్ధం చేశారు. మార్చి 1, 4, 6, 9, 12, 14, 16, 19 తేదీల్లో ప్రథమ, ద్వితీయ సంవత్సరానికి సబంధించిన ఇంగ్లీష్, ఫిజిక్స్, ఎకానమీ, కెమిస్ట్రీ, కామర్స్, సోషియాలజీ, ఫైన్ ఆర్ట్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, జాగ్రఫీ పరీక్షలు జరగనున్నాయి. ఈ పరీక్షలను ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తారు. గత ఏడాది 52 కేంద్రాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరానికి సంబంధించి 13934 మంది, ద్వితీయ సంవత్సరానికి సంబంధించి 14446 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు.



రాయచోటి బాలికల జూనియర్ కళాశాలలో సాయంత్రం వేళ చదువుకుంటున్న విద్యార్థినులు



ప్రాక్టికల్స్‌కు ఏర్పాట్లు..

ఇంటర్మీడియట్ రెగ్యులర్, ఒకేషనల్ కోర్సులకు సంబంధించిన ప్రాక్టికల్స్ నిర్వహణకు ఇంటర్ శాఖ అధికారులు ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నారు. ఈ నెల 5 నుంచి 20వ తేది వరకు ఒకేషనల్ కోర్సులకు సంబంధించిన 2431 మంది విద్యార్థులకు మూడు విడతల్లో ప్రాక్టికల్స్ జరపనున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వీటిని నిర్వహిస్తారు. 7342 మంది రెగ్యులర్ సైన్స్ విద్యార్థులకు ఈనెల 11 నుంచి 20వ తేదీ వరకు రెండు విడతల్లో ప్రాక్టికల్స్ నిర్వహిస్తారు. ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఈ నెల 2 నుంచి ప్రారంభమైన నైతికత, మానవ విలువలపై, 3న పర్యావరణ విద్యపై పరీక్షలు నేటితో(శనివారం) ముగిశాయి. ఈ రెండు పరీక్షలు రాసి అర్హత పొందితేనే ఇంటర్మీడియట్ పాస్ సర్టిఫికెట్ జారీ చేస్తారు.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి



ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులలో ఒత్తిడి లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా సిద్ధం చేస్తున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, సాంఘిక సంక్షేమ కళాశాల, స్కూల్ ప్లస్, కేజీబీవీల్లో ఇంటర్మీడియట్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రభుత్వ ఆదేశానుసారం జాయీభవ సంకల్ప కార్యక్రామన్ని నిర్వహిస్తున్నారు. గత ఏడాది డిసెంబరు 14 నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమం ఈ నెల 24వ తేదీ వరకు కొనసాగనుంది. ప్రతి సబ్జెక్టును రివిజన్ చేయడం, అలాగే అత్యంత ముఖ్యమైన ప్రశ్నలపై విద్యార్థులకు ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నారు. చదువులలో వెనుకబడిన వారిని గుర్తించి వారు పాఠ్యాంశాలపై పట్టు సాధించేలా ఉపాధ్యాయులు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రతి విద్యార్థి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించేలా తర్ఫీదును ఇస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకమైన స్టడీ అవర్స్, ఎప్పటికప్పుడు విద్యార్థుల సందేశాలను ఉపాధ్యాయులు నివృత్తి చేస్తున్నారు.

ఏర్పాటు పూర్తి



ఈనెల 2వ తేదీ నుంచి ప్రారంభమైన ఒకేషనల్, ప్రాక్టికల్ పరీక్షలు, మార్చి 1వ తేది నుంచి ప్రారంభమయ్యే పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ప్రాక్టికల్, థియరీ పరీక్షలలో చిన్నపాటి లోపం జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాలో ఒకేషనల్ కోర్సులున్న 19 జూనియర్ కళాశాలల్లో ఈనెల 5వ తేదీ నుంచి 20 వరకు మూడు విడతల్లో ప్రాక్టికల్స్ పరీక్షలు జరుగుతాయి. ప్రతి విద్యార్థి ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా వారికి తర్ఫీదు ఇచ్చాం. పరీక్షలలో వంద శాతం ఉత్తీర్ణత సాధనకు కృషి చేస్తున్నాం.

–ఎం.కృష్ణయ్య, డీఐఓ, అన్నమయ్య జిల్లా

'ఆడుదాం ఆంధ్ర' చాంపియన్స్‌కు బహుమతులు



విజేత జట్టుకు కప్పు అందజేస్తున్న అతిథులు

కడప స్పోర్ట్స్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్ర' జిల్లాస్థాయి పోటీల్లో పలు జట్లు విజేతలుగా నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు సిద్ధమయ్యాయి. జిల్లాస్థాయిలో చాంపియన్‌లుగా నిలిచిన క్రీడాకారులకు ట్రోఫీలు, నగదు పురస్కార ప్రధానోత్సవ కార్యక్రమంల శనివారం నిర్వహించారు. కడపలోని డీఎస్ఏ క్రీడామైదానంలో నిర్వహించిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్టెప్ సీఈఓ సాయిగ్రేస్ విచ్చేసి విజేతలకు ట్రోఫీలు, నగదు బహుమతి అందజేశారు. డీఎస్‌డీఓ కె. జగన్నాథరెడ్డి మాట్లాడుతూ ఈనెల 9 నుంచి 13వ తేదీ వరకు వైజాగ్‌లో రాష్ట్రస్థాయి పోటీలు జరగుతాయని తెలిపారు. జిల్లాస్థాయిలో విజేతలు గా నిలిచిన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని చెప్పారు. అనంతరం క్రికెట్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్ క్రీడాంశాల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు ట్రోఫీలు నగదు బహుమతులు అందజేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు.

విజేతల వివరాలు..

(ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు)

బ్యాడ్మింటన్ పురుషులు : కడప, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు

బ్యాడ్మింటన్ మహిళలు: కడప, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు

క్రికెట్ పురుషులు: ప్రొద్దుటూరు, కమలాపురం, జమ్మలమడుగు

క్రికెట్ మహిళలు: పులివెందుల

కబడ్డీ పురుషులు: బద్వేలు, మైదుకూరు, ప్రొద్దుటూరు

కబడ్డీ మహిళలు: పులివెందులు, మైదుకూరు, కమలాపురం

ఖోఖో పురుషులు: కమలాపురం, మైదుకూరు, జమ్మలమడుగు

ఖోఖో మహిళలు: జమ్మలమడుగు, కమలాపురం, ప్రొద్దుటూరు

వాలీబాల్ పురుషులు: సిద్దవటం, మైదుకూరు, జమ్మలమడుగు

వాలీబాల్‌మహిళలు: కడప, మైదుకూరు, పులివెందుల

ఎన్నికల నిర్వహణలో బీఎల్వోల పాత్ర కీలకం



ఏఐటీఎస్‌లో స్ట్రాంగ్‌రూంను తనిఖీ చేస్తున్న కలెక్టరు అభిషిక్త్ కిషోర్

జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

రాజంపేట: ఎన్నికల నిర్వహణలో బీఎల్వోల పాత్ర అత్యంత కీలకమని కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ అన్నారు. శనివారం రాజంపేట, నందలూరులో పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు ఉండే విధంగా చూడాలన్నారు. ఎన్నికలు సజావుగా జరిపేందుకు ఎన్నికల సంఘం ఆదేశం మేరకు అన్ని చర్యలను పకడ్బందీగా చేపడుతున్నామన్నారు. రాజంపేట ఆర్డీవో మోహనరావు, తహసీల్దారు సుబ్రమణ్యంరెడ్డి, బీఎల్వోలు పాల్గొన్నారు.

- ఈవీఎం మిషన్ల ద్వారా ఓటు వేసే విధానాన్ని ప్రజలకు తెలిపేందుకు రాజంపేట సబ్‌కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన ఈవీఎం ప్రదర్శన కేంద్రాన్ని పరిశీలించారు. స్వయంగా ఓటు వేసి రిజిస్టర్‌లో సంతకం చేశారు.
- ఏఐటీఎస్‌లో స్ట్రాంగ్ రూంను కలెక్టరు పరిశీలించారు. వీటి నిర్వహణలో ఎలాంటిలోపం ఉండరాదన్నారు. ఎన్నికల నిర్వహణలో స్ట్రాంగ్ రూం ఏర్పాటు కీలకమన్నారు. మ్యాప్‌లను బట్టి ఈవీఎం మిషన్లు తగిన రీతిలో ఏర్పాటుచేయాలన్నారు. స్ట్రాంగ్‌రూంలోకి నీరు రాకుండా జాగ్రత్త పడాలన్నారు. ఎన్నికల నిర్వహణకు పూర్తి సహకారం అందిస్తామని కలెక్టర్‌కు ప్రిన్సిపాల్ జయరామిరెడ్డి విన్నవించారు.
- నందలూరు మండలం ఎర్రచెరువుపల్లెలోని పోలింగ్ కేంద్రాన్ని కలెక్టరు తనిఖీ చేశారు. అలాగే ప్రభుత్వజూనియర్ కళాశాలలో పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. కలెక్టర్ కార్యక్రమంలో సర్వేయరు వెంకటసుబ్బయ్య సొమ్మసిల్లిపడి పోవడంతో చికిత్స నిమిత్తం వెంటే ఆసుపత్రికి చేర్పించిన సంఘటన చోటుచేసుకుంది.

అయ్యవారు కావాలి అయ్యా..

నందలూరు మండలం ఎర్రచెరువుపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ సందర్శించారు. ఈ సందర్భంగా నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు గాయత్రి, అనితలు అయ్యవారు కావాలని కోరిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. పాఠశాలలో దాదాపు 32 మంది విద్యను అభ్యసిస్తుండగా కేవలం ఒక ఉపాధ్యాయురాలు స్నేహాంజలి మాత్రమే ఉన్నారు. అంతమందికి పాఠశాలు చెప్పడం కష్టతరంగా మారిందని చిన్నారులు తమ మనస్సులోని బాధను కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి జవాబులు రాబట్టారు.



విద్యార్థులను ప్రశ్నలు అడిగి జవాబులు తెలుసుకుంటున్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

మహమ్మారిపై సమరం

నేడు ప్రపంచ కేన్సర్ డే

- రిమ్స్‌లో అధునాతన వైద్య సేవలు
- రూ.107 కోట్లతో 100 పడకలతో కేన్సర్ కేర్ సెంటర్ నిర్మాణం

కడప అర్బన్: కేన్సర్ మహమ్మారిని పారదోలేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. యూనియన్ ఫర్ ఇంటర్నేషనల్ కేన్సర్ కంట్రోల్ (యూఐసీసీ) వారు ప్రపంచ కేన్సర్‌డేగా 2000 ఫిబ్రవరి 4 నుంచి ప్రతి ఏడాది నిర్వహిస్తున్నారు. కడప లోని ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఏడాదికాలం నుంచి ఓపీ విభాగంలో కేన్సర్ వ్యాధి గ్రస్తులకు వైద్య పరీక్షలను నిర్వహిస్తున్నారు. జనరల్ సర్జరీ విభాగం, రేడియేషన్ అంకాలజీ, సర్జికల్ అంకాలజీ, మెడికల్ అంకాలజీ విభాగాల వారు వైద్య సేవలను అందిస్తున్నారు.

డాక్టర్ వైఎస్ఆర్ కేన్సర్ కేర్ సెంటర్ .. రాష్ట్రానికే తలమానికం

కడపలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఆవరణలో డాక్టర్ వైఎస్ఆర్ కేన్సర్ కేర్ సెంటర్‌ను రూ. 107 కోట్ల వ్యయంతో నిర్మించారు. 100 పడకల సామర్థ్యంతో పూర్తి చేశారు. గత డిసెంబర్ 23న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కడప రిమ్స్ ఆవరణలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, మానసిక వైద్యశాల, డాక్టర్ వైఎస్ఆర్ కేన్సర్ కేర్ హాస్పిటల్‌లను నిర్మింపచేసి ప్రారంభించారు.

- కడపలోని డాక్టర్ వైఎస్ఆర్ కేన్సర్ హాస్పిటల్‌లో వారం రోజుల్లో ఓపీ సేవలు ప్రారంభమవుతాయి. ఐపీ సేవలు ఈనెలాఖరున ప్రారంభమవుతున్నాయి. ఇప్పటివరకు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో జనరల్ సర్జరీ విభాగంతో పాటు, ప్రత్యేకంగా కేన్సర్ ఓపి విభాగంలో వైద్య పరీక్షలు చేపడుతున్నారు. ప్రతి రోజూ ఓపి విభాగానికి 10 నుంచి 20 వస్తున్నారు. ఏడాదికి కనీసం 100 నుంచి 150 వరకు ఇంతవరకు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని జనరల్ సర్జరీ విభాగంలోనే నిర్వహించారు.
- కేన్సర్ కేర్ హాస్పిటల్‌లో ఐపీ విభాగంలో సర్జికల్ అంకాలజీలో 35 పడకలు, మెడికల్ అంకాలజీలో 35 పడకలు, రేడియేషన్ అంకాలజీలో 35 పడకలు, ఐసీయు కేర్ యూనిట్‌తో కలిసి 140 పడకలను ఏర్పాటు చేయనున్నారు.
- కేన్సర్ వ్యాధి గ్రస్తులకు సర్జరీ, రేడియోథెరఫీ, కీమోథెరఫీల ద్వారా వైద్య సేవలను అందించనున్నారు.
- రాష్ట్ర వ్యాప్తంగా తిరుపతి, కర్నూలు, అనంతపురం, వైజాగ్, గుంటూరులలోని ప్రభుత్వ వైద్యకళాశాల, వైద్య శాలలో కేన్సర్ ఓపీ, ఐపీ విభాగాలను నిర్వహిస్తున్నారు. భవిష్యత్తులో రాష్ట్రంలోనే తలమానికంగా ఈ హాస్పిటల్ వైద్య సేవలను అందించనుంది. ప్రస్తుతం సూపరింటెండెంట్‌గా డాక్టర్ కె. వాణి, సర్జికల్ అంకాలజీ హెచ్ఓడిగా డాక్టర్ అమానుల్లా, రేడియేషన్ అంకాలజీ హెచ్ఓడిగా డాక్టర్ ప్రవీణ వ్యవహరిస్తున్నారు.



కడప రిమ్స్ ఆవరణలోని డాక్టర్ వైఎస్ఆర్ కేన్సర్ కేర్ సెంటర్



కేన్సర్ సెంటర్ ఏర్పాటు అభినందనీయం



రాష్ట్రంలోనే తొలిసారిగా కడపలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణలో డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేరు మీద డాక్టర్ వైఎస్ఆర్ కేన్సర్ కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయం. జిల్లా ప్రజలు ముఖ్యమంత్రికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. భవిష్యత్తులో కేన్సర్ వ్యాధి గ్రస్తులు దూర ప్రాంతాలకు వెళ్లకుండా ఇక్కడ ఉపశమనం పొందేలా అన్ని చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ కె. వాణి, సూపరింటెండెంట్, డాక్టర్ వైఎస్ఆర్ కేన్సర్ కేర్ సెంటర్,కడప

కర్ణాటక మద్యం స్వాధీనం
– ఇద్దరు నిందితులు అరెస్ట్

మదనపల్లె : అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకుని ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేసినట్లు తాలూకా సీఐ ఎం.శేఖర్ తెలిపారు. శనివారం సాయంత్రం మండల సరిహద్దులోని చీకిలబైలు రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్ట్‌లో తనిఖీలు నిర్వహిస్తుండగా, మదనపల్లి పట్టణం కృష్ణానగర్‌కు చెందిన పి.కనక సభాపతి (34), బెంగళూరు ఇంద్రనగర్ మునియప్పరెడ్డి బిల్డింగ్‌కు చెందిన ఆల్విన్ జేమ్స్ (31), వేర్వేరుగా కర్ణాటక మద్యం బీర్లు తరలిస్తూ పట్టుబడినట్లు తెలిపారు. కనక సభాపతి వద్ద 1160 రూపాయల విలువ చేసే 8 బీర్లు, ఆల్విన్ జేమ్స్ వద్ద 990 రూపాయల విలువచేసే ఆరు బీర్లు వేర్వేరుగా స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

కారు ఢీకొని వృద్ధుడికి గాయాలు


తీవ్రంగా గాయపడిన పీరా

మదనపల్లె : కారు ఢీకొని వృద్ధుడు తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం కురబలకోట మండలంలో జరిగింది. కురబలకోటకు చెందిన సి. పీరా (65), గ్రామానికి సమీపంలో నడుచుకుంటూ వెళ్తూ గ్యాస్ గోడౌన్ వద్ద రోడ్డు క్రాస్ చేస్తుండగా, అటువైపు నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొంది. ప్రమాదంలో పీరా తీవ్రంగా గాయపడగా వెంటనే స్థానికులు 108 అంబులెన్స్ వాహనంలో బాధితుడిని మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తీసుకెళ్లారు. ముదివేడు పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

మంగంపేటపై సీఎంకు ప్రత్యేక అభిమానం

ఏపీఎండీసీ ఎండీ వి.జి. వెంకటరెడ్డి


మంగంపేట అగ్రహారం గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎండీ వీజీ వెంకటరెడ్డి

ఓబులవారిపల్లె : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మంగంపేట అంటే ప్రత్యేక అభిమానమని ఎండీ వి.జి. వెంకటరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన మంగంపేట ఏపీఎండీసీ రామాలయంలో కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో మంగంపేట కాపుపల్లె, హరిజనవాడ, అరుంధతివాడ గ్రామాలకు మెరుగైన పునరావాస పరిహారం అందిస్తామన్నారు. మంగంపేట పంచాయతీలోని వృద్ధులకు ఏపీఎండీసీ ద్వారా రెండువేల రూపాయలు ప్రత్యేకంగా పింఛన్‌ను అందిస్తున్నామని తెలిపారు. అనంతరం పునరావాస గ్రామాల ఉద్యోగులు మాట్లాడుతూ తమను పర్మినెంట్ చేయాలని కోరారు. దీనిపై ఎండీ స్పందిస్తూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు సహకారంతో ఉద్యోగుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. మంగంపేట అగ్రహారం గ్రామ ప్రజలు ఎండీతో మాట్లాడుతూ తమకు ప్రస్తుతం మార్కెట్ ధర చెల్లిస్తూ ముక్కావారిపల్లె పంచాయతీలోని జాతీయ రహదారి పక్కన ఉన్న స్థలంలో పునరావాసం కల్పిస్తున్నట్లు కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేశారన్నారు. తమకు ముందు జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం పునరావాస పరిహారం చెల్లించాలని కోరారు. పదిరోజుల్లో సమస్యను పరిశీలించి పరిష్కరిస్తామని ఎండీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఏఓ సుదర్శన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఆర్‌వీ రమణ, గుంతకల్లు రైల్వేబోర్డు వినియోగదారుల కమిటీ సభ్యుడు తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ కొలూరి అమరేశ్వర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఓరుగంటి అనిల్, మాజీ ఎంపీటీసీ సుబ్రమణ్యం, సీఎస్ఆర్ అధికారి శగినల సుబ్రమణ్యం, గల్లా శ్రీనివాసులు, మైనార్టీ నాయకుడు షేక్ కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

రోబోటిక్ టెక్నాలజీ ద్వారా కీళ్ల మార్పిడి


మీడియాతో మాట్లాడుతున్న డాక్టర్ విద్యాసాగర్‌రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : అత్యాధునిక రోబోటిక్ టెక్నాలజీతో మోకాలు, తుంటి కీళ్ల మార్పిడి శస్త్ర చికిత్సలు రాయలసీమలోనే ప్రప్రథమంగా అందుబాటులోకి తెచ్చామని విద్యాసాగర్ ఆర్థోపెడిక్ హాస్పిటల్ ఎండీ డాక్టర్ విద్యాసాగర్‌రెడ్డి తెలిపారు. శనివారం తన ఆస్పత్రిలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అమెరికాకి చెందిన స్మిత్ - నెఫ్యూ కంపెనీ కి చెందిన రోబోటిక్ సిస్టంను గత కొన్ని రోజులుగా ఉపయోగించి సంతృప్తికరమైన సత్ఫలితాలను పరిశీలించిన తర్వాతనే తమ ఆస్పత్రిలో రోబోటిక్ టెక్నాలజీ ద్వారా మోకాలు, తుంటికీళ్ల మార్పిడి శస్త్ర చికిత్సలు విజయవంతంగా చేస్తున్నామన్నారు. రోబోటిక్ టెక్నాలజీని డిజైన్ చేసిన బృందంతో చర్చించిన తర్వాత ఈ టెక్నాలజీని తీసుకు రావడం జరిగిందన్నారు. రోబోటిక్ టెక్నాలజీ ద్వారా వంద శాతం ఖచ్చితత్వం, సంతృప్తికరమైన సత్ఫలితాలు వంటి అనేక లాభాలను ఆయన వివరించారు. తమ ఆస్పత్రిలో నిష్ణాతులైన వైద్య బృందంతో శస్త్ర చికిత్సలు విజయవంతంగా చేస్తున్నామన్నారు. అనంతరం రోబోటిక్ టెక్నాలజీ ద్వారా మోకాలు శస్త్ర చికిత్స చేయించుకున్న పేషంట్లు తమ సంతృప్తిని మీడియాతో పంచుకున్నారు. విద్యాసాగర్‌రెడ్డి రోబోటిక్ టెక్నాలజీ ద్వారా మోకాలు, తుంటి కీళ్ల మార్పిడి శస్త్ర చికిత్స విధానాన్ని ఆపరేషన్ థియేటర్‌లో వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యాసాగర్ ఆర్థోపెడిక్ ఆస్పత్రి సీఈఓ ఎన్.సురేష్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ ఎస్.శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యువతను సన్మార్గంలో నడిపించాలి

సీనియర్ సివిల్ జడ్జి ఎస్ బాబా ఫక్రుద్దీన్


న్యాయవిజ్ఞాన సదస్సులో పాల్గొన్న న్యాయమూర్తులు

రాయచోటి : జైళ్లలో ఉన్న నేరస్తులను, యువతను గుర్తించి వారికి న్యాయ సహాయం అందించి సన్మార్గంలో నడిపించేందుకు పాన్ ఇండియా ప్రచారం –2024 కార్యక్రమం చేపట్టిందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ అన్నారు. శనివారం రాయచోటి సబ్ జైలును సీనియర్ సివిల్ జడ్జితో పాటు జూనియర్ సివిల్ జడ్జి డాక్టర్ శారద, కమిటీ సభ్యులు సందర్శించి న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్యంగా పాన్ ఇండియా ప్రచారం ద్వారా జైళ్లలో ఉన్న బాలనేరస్తులను గుర్తించడం, వారికి న్యాయ సహాయం అందిచడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని న్యాయమూర్తులు తెలిపారు. ఈ కార్యక్రమం కడప, ప్రొద్దుటూరు, రాయచోటి, రాజంపేట, జమ్మలమడుగు, బద్వేల్, పులివెందుల, కమలాపురం జైళ్లల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయచోటి సబ్ జైల్ సూపరింటెండెంట్, సిబ్బంది, ఖైదీలు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి..

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకుని ఎక్కువ కేసులను పరిష్కరించుకునేలా చూడాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి సూచించారు. శనివారం న్యాయమూర్తి లక్కిరెడ్డిపల్లి కోర్టును సందర్శించారు. ఈనెల 9వ తేదీన జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించనున్నట్లు తెలిపారు. లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా కృషి చేయాలని లక్కిరెడ్డిపల్లి న్యాయవాదులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లి జూనియర్ సివిల్ జడ్జి ఫైజున్నిసా, బార్ ప్రెసిడెంట్, న్యాయవాదులు పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో ఇద్దరు వ్యక్తులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మదనపల్లి మండలం బైరెడ్డి కాలనీకి చెందిన కృష్ణమూర్తి కుమారుడు ప్రభు కుమార్ (19) అంగళ్ల వద్ద ఉన్న ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీలో రెండవ సంవత్సరం చదువుతున్నాడు. శనివారం కాలేజీకి వెళ్లి పరీక్ష రాసి వచ్చాడు. కుటుంబ సమస్యలతో మనస్తాపం చెంది ఇంటి వద్ద విషద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అదేవిధంగా కురబలకోట మండలం మట్లివారిపల్లెకు చెందిన వెంకటరమణ కుమారుడు ఆనంద్ (35), గత కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతూ అనారోగ్యం పాలయ్యాడు. పలు ఆసుపత్రుల్లో చికిత్స పొందాడు. శనివారం మరోసారి కడుపు నొప్పి తిరగబెట్టడంతో భరించలేక పురుగుమందు తాగాడు. ఆయా ఘటనల్లో గమనించిన కుటుంబ సభ్యులు బాధితులను 108 వాహనంలో మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విదేశీయుడి పాస్ పోర్ట్ చోరీ

మదనపల్లె: సరదాగా కాలక్షేపానికి కుటుంబ సభ్యులతో కలిసి సినిమాకు వెళ్లిన విదేశీయుని పాస్ పోర్ట్ చోరీకి గురైన సంఘటన శుక్రవారం రాత్రి మదనపల్లె లో జరిగింది. సిరియా దేశానికి చెందిన మహమ్మద్ హనీఫా (35), అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లి మండలం రెడ్డివారిపల్లెకు చెందిన మాసాబీ (45)కి భర్త లేకపోవడంతో ఉపాధి కోసం విదేశాలకు వెళ్లింది. అక్కడ మహమ్మద్ హనీఫాను రెండవ వివాహం చేసుకుంది. వీరిద్దరూ కలిసి గత జనవరి నెల 16వ తేదీన స్వగ్రామమైన లక్కిరెడ్డిపల్లె మండలం రెడ్డివారిపల్లెకు వచ్చారు. కొన్ని రోజులుగా బంధువుల ఇళ్లకు వెళుతూ అదే క్రమంలో శుక్రవారం కురబలకోట మండలం అంగళ్లకు వచ్చారు. కుటుంబ సభ్యులు బంధువులు 14 మంది కలిసి శుక్రవారం రాత్రి మదనపల్లె శ్రీకృష్ణ థియేటర్‌కు ఫస్ట్ షో సినిమాకు వెళ్లారు. సినిమా పూర్తయిన తర్వాత తమ వెంట ఉన్న పర్సు కూర్చున్న సీటులోనే మర్చిపోయి అక్కడి నుంచి బయటకు వచ్చారు. వెంటనే గుర్తుంచుకొని సినిమా థియేటర్‌లోకి వెళ్లి చూడగా పర్స్ చోరీకి గురైనట్లు తెలుసుకున్నారు. వెంటనే థియేటర్ యాజమాన్యం నుంచి సీసీ ఫుటేజ్ సేకరించారు. పర్స్ లో మహమ్మద్ హనీఫాకు చెందిన విదేశీ పాస్ పోర్ట్, మాసాబీ అలియాస్ ఆయేషా పాస్ పోర్ట్‌తో పాటు 30 వేల రూపాయల విదేశీ నగదు, 15 వేల రూపాయల ఇండియన్ కరెన్సీ, 10 గ్రాముల బంగారు ఆభరణం, పర్సులో ఉన్నట్లు వారు తెలిపారు. చోరీ ఘటనపై మదనపల్లె టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లోనూ, జిల్లా ఎస్పీ కార్యాలయంలోనూ బాధితులు ఫిర్యాదు చేశారు.

రైలు కింద పడి యువకుడి మృతి


మృతి చెందిన సోమశేఖర్


సోమశేఖర్ (ఫైల్)

వాల్మీకిపురం : మండలంలోని చింతపర్తి సమీపంలో రైలు కింద పడి ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... మదనపల్లి మండలం, కొండామర్రిపల్లి, టీఎస్ఆర్ కాలనీకి చెందిన పెద్దరెడ్డి కుమారుడు అనిపినేని సోమశేఖర్ (26) చింతపర్తి సమీపంలోని రైల్వే లైన్ వద్ద శనివారం రైలు కింద పడి మృతి చెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి మృతికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

దుబాయ్‌లో కలిచెర్ల వాసి మృతి



షబ్బీర్‌వలీ (ఫైల్), షబ్బీర్‌వలీ ఇంటి ముందు దీనంగా కూర్చున్న కుటుంబ సభ్యులు

పెద్దమండ్యం : బతుకుదెరువు కోసం దుబాయ్ వెళ్లిన ఓ వ్యక్తి అక్కడ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులకు శనివారం సమాచారం అందింది. కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కలిచెర్ల గ్రామం సుబహానీ వీధికి చెందిన షేక్ షబ్బీర్ వలీ (37) ఇక్కడ వారపుసంతల్లో మిఠాయి వ్యాపారం చేసుకుని జీవనం సాగించేవాడు. ఇతనికి మొదటి భార్య చనిపోవడంతో, మరొక మహిళను రెండవ వివాహం చేసుకున్నాడు. మొదటి భార్యకు ఇద్దరు కుమార్తెలు కాగా, రెండవ భార్యకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. దుబాయ్‌లో కూలి పనుల కోసం మూడు నెలల క్రితం వెళ్లాడు. శుక్రవారం మధ్యాహ్నం నమాజ్ ముగించుకుని గదికి వచ్చి పడుకోగానే గుండెపోటు రావడంతో మృతిచెందినట్లు అక్కడి నుంచి కుటుంబ సభ్యులకు సమాచారం వచ్చింది. దీంతో కుటుంబంలో విషాదం నెలకొంది. ఇంటి వద్ద భార్య, బిడ్డలు మృతదేహం కోసం ఎదురుచూస్తున్నారు. గ్రామానికి చెందిన మరొకరు అక్కడే ఉండడంతో ఎప్పటికప్పుడు సమాచారం వస్తోందని, అయితే మృతదేహం పంపాలంటే రూ. 2 లక్షలు ఖర్చు అవుతుందని చెప్పినట్లు కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి మృతదేహాన్ని కలిచెర్లకు రప్పించేందుకు చొరవ తీసుకోవాలని వారు కోరుతున్నారు.

బావిలో దూకి మహిళ ఆత్మహత్య


మృతిచెందిన రామలక్షుమ్మ

గాలివీడు : మండలంలోని గొట్టివీడు గ్రామం యర్రయ్యగారిపల్లెకు చెందిన ఎస్.రామలక్షుమ్మ(23) బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. వివరాలు ఇలా.. ఎస్.రామాంజులు, రామలక్షుమ్మ దంపతుల కుమారుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కుమారుడి మరణం జీర్ణించుకోలేక తల్లి సమీపంలోని బావిలో దూకి తనువు చాలించింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ వెంకటప్రసాద్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

11 మంది జూదరుల అరెస్టు

గుర్రంకొండ : మండలంలోని చెర్లోపల్లెలో కోడి పందెం స్థావరాలపై పోలీసులు దాడులు నిర్వహించి 11 మంది జూదరులను పోలీసులు శనివారం అరెస్టు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. చెర్లోపల్లె సమీప అటవీ ప్రాంతంలో జోరుగా కోడిపందేలు నిర్వహిస్తున్నారనే సమాచారం అందుకొన్న పోలీసులు దాడులు నిర్వహించారు. జూదరులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి నాలుగు పందెం కోడిపుంజులు రూ.7550 నగదు స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్ఐ నాగార్జునరెడ్డి తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

పుష్పగిరి హుండీ ఆదాయం లెక్కింపు

వల్లూరు : పవిత్ర పుణ్య క్షేత్రమైన పుష్పగిరి కొండ పైన గల శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని శనివారం లెక్కించారు. శ్రీ చెన్న కేశవ స్వామి ఆలయంలో దేవదాయ శాఖ అధికారులు, భక్తుల సమక్షంలో ఆలయంలో ఏర్పాటు చేసిన హుండీల ద్వారా భక్తులు స్వామి వారికి సమర్పించిన కానుకలను లెక్కించారు. ఇందులో రూ 3,21,795 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ శ్రీనివాసులు తెలిపా రు.

రైలుపట్టాలపై యువకుడి మృతదేహం


రైలు పట్టాలపై లభ్యమైన బాలాజీ (25) మృతదేహం

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట రైల్వేస్టేషన్ సమీపంలో గల రైలు పట్టాలపై శనివారం అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. రైల్వేపోలీసులు తెలిపిన వివరాల మేరకు ఒంటిమిట్ట రైల్వే స్టేషన్ సమీపంలో రాజంపేట వైపు వెళ్లే రైలు పట్టాలపై తమిళనాడుకు చెందిన కేజే బాలాజీ (25) అనే యువకుడి మృతదేహం లభ్యమైంది. మృతుడు వేసుకున్న దుస్తులలో ఉన్న డ్రైవింగ్ లైసెన్సు ద్వారా వివరాలను కుటుంబ సభ్యులకు పంపించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

ఆర్ట్స్‌కాలేజీ రోడ్డులో చోరీ

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక ఆర్ట్స్‌కాలేజీ రోడ్డులోని సంజీవరాయుడు ఇంట్లో చోరీ జరిగింది. సంజీవరాయుడు శుక్రవారం కుటుంబ సభ్యులతో కలిసి ఆళ్లగడ్డ మండలంలోని పడకండ్లలో జరిగిన నరసింహస్వామి పారవేట ఉత్సవానికి వెళ్లాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం ఇంటి తలుపులు తెరచి ఉండటంతో స్థానికులు సంజీవరాయుడు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు హుటాహుటిన ప్రొద్దుటూరుకు వచ్చారు. ఇంట్లోని బీరువాలో పరిశీలించగా రూ. 40 వేలు నగదు, ఒకటిన్నర తులం బంగారు కనిపించలేదు. వన్‌టౌన్ పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు.

పందుల చోరీపై కేసు నమోదు

ముద్దనూరు : మండల కేంద్రంలో 50 పందులు చోరీకి గురైనట్లు శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. రెండు రోజుల క్రితం తమ పందులను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని ముద్దనూరుకు చెందిన సుబ్బమ్మ అనే మహిళ ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మైనుద్దీన్ తెలిపారు.

పరిపూర్ణంగా అనుగ్రహించే తల్లి లూర్దుమాత


సందేశం ఇస్తున్న విచారణ గురువు

కడప కల్చరల్ : లూర్దుమాత మానవాళిని పరిపూర్ణంగా అనుగ్రహించే తల్లి అని బద్వేలు విచారణ గురువులు రెవ ఫాదర్ గొడుగునూరు విజయరావు అన్నారు. స్థానిక మరియాపురంలో శనివారం లూర్దుమాత తిరునాల మహోత్సవం రెండవ రోజు రెవరెండ్ ఫాదర్ లక్కినేని ఆరోగ్య రాజు దివ్యబలి పూజను సమర్పించగా, విజయరావు దేవుని సందేశాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలందరినీ అనుగ్రహించి వారిని పాపాల నుంచి దూరం చేసేలా అనుగ్రహించే మాత అందరికీ సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. మనుషుల మధ్య ఐక్యత కొరవడిందని, కుటుంబాలలో శాంతి సమాధానం సన్నగిల్లుతోందని, ప్రార్థనాలయాల సంఖ్య పెరుగుతున్నా, ప్రార్థనలు చేసే వారు ఎక్కువ అవుతున్నా సమాజంలో అరాచకాలు ఏమాత్రం తగ్గడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పూజ ప్రారంభంలో బద్వేలు విచారణకు చెందిన విశ్వాసులు ప్రత్యేకంగా అలంకరించిన లూర్దుమాత తేరును పురవీధుల ద్వారా ఊరేగింపుగా ప్రార్థనలు చేస్తూ సాగారు. విచారణ గురువులు, విశ్వాసులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆవిష్కరణలపై దృష్టి సారించాలి

కమలాపురం : ప్రతి విద్యార్థి సమాజానికి ఉపయోగపడే నూతన సాంకేతిక ఆవిష్కరణలపై దృష్టి సారించాలని కడప, ప్రొద్దుటూరు, రాయచోటి పాలిటెక్నిక్ కళాశాలల ప్రిన్సిపల్స్ శ్రీనివాసరావ్, జగదీశ్వరుడు, శివశంకర్ తెలిపారు. శనివారం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ప్రిన్సిపల్ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అధ్యాపక బృందం పర్యవేక్షణలో ఆ కళాశాల విద్యార్థులు ఏర్పాటు చేసిన టెక్‌వేవ్-2024ను వారు ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన 32 ప్రాజెక్ట్‌లను పరిశీలించారు. విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులన్నీ ప్రజల దైనందిన జీవితాలకు సంబంధించినవి, రైతులు, పరిసర ప్రాంతాల ప్రజలకు అవసరమయ్యేవి కావడంతో విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పట్టణంలోని అన్ని పాఠశాలల హెచ్‌ఎంలు,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజంపేటలో బంగారు బిస్కెట్లు పట్టివేత

- రూ.1.338 కేజీ ఉన్నట్లు నిర్ధారణ
- అర్బన్ సీఐ మద్దయ్య ఆచారి వెల్లడి


బంగారు బిస్కెట్లు స్వాధీనం చేసుకున్న వివరాలు వెల్లడిస్తున్న సీఐ మద్దయ్య ఆచారి

రాజంపేట : తిరుపతి-కడప రహదారిలో శనివారం రాత్రి పోలీసుల తనిఖీలలో 1.338 కేజీల బరువు కలిగిన బంగారు బిస్కెట్లను పట్టుకున్నారు. ఈమేరకు సీఐ మద్దయ్య ఆచారి మాట్లాడుతూ ఎస్పీ కృష్ణారావు ఆదేశాల మేరకు డీఎస్పీ చైతన్య ఆధ్వర్యంలో సాయంత్రం నుంచి తిరుపతి-కడప రోడ్డులో వాహనాల తనిఖీలు నిర్వహించామన్నారు. పట్టణ శివార్లలోని వై.జంక్షన్ వద్ద బ్రీజా కారు నెంబరు ప్లేట్‌లేకుండా రావడం చూసి , ఆపి తనిఖీలు చేశామన్నారు. డ్రైవర్ షేక్ అజ్మత్ (డ్రైవర్), కన్కేర్ మహమ్మద్ జిలానీబాషా (ఓనర్)గా గుర్తించామన్నారు. అనుమానంతో తమ సిబ్బందితో కారును క్షుణ్ణంగా తనిఖీ చేశామన్నారు. డ్రైవరు సీటు కింద దిండులాంటిది బరువుగా ఉన్నందున , దానిని తెరిచి చూశామన్నారు. అందులో మూడు కవర్లలో బంగారు బిస్కెట్లు ఉన్నాయన్నారు. వాటిని వెయింగ్ మిషన్‌తో తూకం వేయించగా మొత్తం 1.338 కేజీల బరువు ఉందన్నారు. యజమాని కన్కేర్ మహమ్మద్, జిలానీ బాషా బంగారు బిస్కెట్లకు సంబంధించి ఎలాంటి బిల్లులు చూపలేదన్నారు. దీంతో జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్, సేల్స్‌ట్యాక్స్ అధికారులకు తదుపరి చర్య నిమిత్తం నివేదించామన్నారు.